సాక్షి
సూర్యాపేట
శుక్రవారం । 7 । ఫిబ్రవరి । 2025



నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
యాదగిరిగుట్టలోని పూర్వగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. - 8లో



జల విద్యుత్ కేంద్రంలో చోరీ
నేరేడుచర్ల మండలం వైకుంఠాపురం గ్రామ పరిధిలోని జల విద్యుత్ కేంద్రంలో బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. - 8లో



రేపు నవోదయ పరీక్ష
చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ, 11వ తరగతిలో ఖాళీల భర్తీకి శనివారం ప్రవేశ పరీక్ష జరగనుంది. - 8లో

న్యూస్‌రీల్

మెనూ ప్రకారం భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

సూర్యాపేటటౌన్ : సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. గురువారం రాత్రి సూర్యాపేట పట్టణంలోని తాళ్లగడ్డలో గల ఎస్సీ సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వంటగది, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్, కూరగాయలు, పాలు, పప్పు, వంట సామగ్రిని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలని, దాని సాధనకు నిరంతరం శ్రమించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ రోజు భోజనం ఇలాగే ఉంటుందా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కలెక్టర్‌ని పలు సందేహాలు అడగగా సమాధానం చెబుతూవారిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహవార్డెన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

సీఐని సస్పెండ్ చేయాలి



విధులు బహిష్కరించి కోర్టు బయట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

హుజూర్‌నగర్ : వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది గంధం శివపై దాడికి పాల్పడిన ట్రాఫిక్ సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని స్థానిక న్యాయవాదులు డిమాండ్ చేశారు. గురువారం హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమ కొండ ట్రాఫిక్ సీఐ, అతని అనుచర కానిస్టేబుళ్లు.. న్యాయవాదితో దురుసుగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే రూపొందించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ విధుల బహిష్కరణకు న్యాయమూర్తులు సహకరించాలని కోరుతూ రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శ్యాం శ్రీ, సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాం కుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్‌లకు వారు వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జక్కుల వీరయ్య, న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, యాదగిరి, అంజయ్య, నాగార్జున, రమణారెడ్డి, విజికే మూర్తి, రామ లక్ష్మారెడ్డి, నరేష్, వెంకటేశ్వర్లు, రాఘవరావు, నాగేష్ రాథోడ్, లతీఫ్, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, రమేష్, శ్రీను, కష్ణమూర్తి పాల్గొన్నారు.

4వ రోజు రెండు నామినేషన్లు

నల్లగొండ: వరంగల్-నల్లగొండ-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నాలుగవ రోజైన గురువారం ఇద్దరు నామినేషన్లు సమర్పించారు. స్వతంత్ర అభ్యర్థులైన అర్వ స్వాతి, చాలిక చంద్రశేఖర్ నామినేషన్లు దాఖలు చేశారు. వీరు తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠికి సమర్పించారు. అలాగే లింగిడి వెంకటేశ్వర్లు మరో సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు.

నేడు ప్రధాన సంఘాల అభ్యర్థుల నామినేషన్..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్లకు 7, 10వ తేదీల్లోనే అవకాశం ఉండడంతో ఆ రెండు రోజుల్లో నామినేషన్లు దాఖలు చేసేందుకు ప్రధాన సంఘాలకు చెందిన అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. దీంట్లోభాగంగా శుక్రవారం ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి టీఎస్ యూటీఎఫ్ తరపున నామినేషన్ వేయనున్నారు. అలాగే టీపీయూఎస్ అభ్యర్థి సరోత్తం రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి నామినేషన్లు సమర్పించనున్నారు. కాగా పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి 10వ తేదీన నామినేషన్ సమర్పించేందుకు సిద్ధమవుతున్నారు.



స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న అర్వ స్వాతి

ఫణిగిరిలో బౌద్ధశిల్పాలు అద్భుతం



ఫణిగిరిలోని మ్యూజియంలో బౌద్ధసంపదను పరిశీలిస్తున్న శ్రీలంక ఎయిర్‌లైన్స్ అధికారులు

నాగారం : ఫణిగిరిలో బౌద్ధ శిల్పాలు అద్భుతంగా ఉన్నాయని శ్రీలంక దేశానికి చెందిన 15మంది ఎయిర్ లైన్స్ అధికారులు కొనియాడారు. నాగారం మండలం ఫణిగిరి బౌద్ధ క్షేత్రాన్ని శ్రీలంక ఎయిర్‌లైన్స్ అధికారులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి పురావస్తు శాఖ పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈఓ బుద్ధవనం కన్సల్టెంట్ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ఫణిగిరి బౌద్ధక్షేత్ర ప్రాముఖ్యతను, మ్యూజియంలో భద్రపర్చిన బౌద్ధశిల్ప సంపద గురించి వివరించారు. అనంతరం శ్రీలంక ఎయిర్స్ లైన్స్ అధికారులు మాట్లాడారు. ఫణిగిరి బౌద్ధక్షేత్రం పురాతనమైన గొప్ప చారిత్రక ప్రాంతమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీటీడీసీ మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ జింజిరాల సాయిరాం, పురావస్తు శాఖ సిబ్బంది గట్టు వీరయ్య, యాకయ్య, కార్తీక్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కు జాతీయ పురస్కారం



నాగమల్లుకు అవార్డు అందజేస్తున్న సుప్రీం కోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్‌వీ రమణ

సూర్యాపేట: హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామానికి చెందిన అంజపల్లి నాగమల్లుకు అవేసంస్థ జాతీయ పురస్కారం అందించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో భారత సుప్రీం కోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్‌వీ రమణ చేతుల మీదుగా ఈ పురస్కారం ప్రదానం చేశారు. నిజాయితీ పరులను గౌరవించాలనే సదుద్దేశంతో తమ సంస్థ అవార్డు అందిస్తూ వస్తోందని అవే సంస్థ వ్యవస్థాపకుడు వైకుంఠం ప్రభాకర్ చౌదరి తెలిపారు. 15 ఏళ్లుగా పోలీస్ విభాగంలో పనిచేస్తూ అవినీతికి దూరంగా ప్రజల కోసం పనిచేస్తున్న నాగమల్లుకు అవార్డు అందజేశామన్నారు.

9 నుంచి దుకాణాలకు స్థలాల కేటాయింపు




మాట్లాడుతున్న వేలంపాట హక్కుదారులు

చివ్వెంల(సూర్యాపేట) : చివ్వెంల మండలం దురాజ్‌పల్లి పరిధిలోని శ్రీ లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతర ఈనెల 16 నుంచి 20 వరకు జరగనున్న నేపథ్యంలో ఈనెల 9,10,11 తేదీల్లో దుకాణాల ఏర్పాటు కోసం స్థలాలు కేటాయించనున్నట్లు వేలం పాట హక్కు దారులు మామిడి కిరణ్, పాల్వాయ్ లక్ష్మణ్ తెలిపారు. గురువారం పెద్దగట్టు ఆలయ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో దుకాణాల రశీదులు పొందిన వారు ఆయా తేదీల్లో సంప్రదించాలని కోరారు. నిర్దేశించిన తేదీలలో రాకపోతే స్థలాలు కేటాయించబోమని స్పష్టం చేశారు. సమయానికి వచ్చి రశీదులు తీసుకుని సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల రాము, పాల్వాయ్ ప్రభాకర్, వినయ్ వర్మ పాల్గొన్నారు.

బియ్యం ఇప్పటి నుంచే..

- పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామాల్లో కొత్త రేషన్‌కార్డుదాలకు పంపిణీ
- నూతనంగా 2,350 కార్డులు జారీ
- ఇప్పటికే అదనంగా రేషన్ కోటా కేటాయింపు



పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాలు **23**	జారీ చేసిన నూతన రేషన్ కార్డులు **2,350**
యూనిట్లు **5,200**	అదనంగా కేటాయించిన కోటా **31,200** మెట్రిక్ టన్నుల బియ్యం

భానుపురి (సూర్యాపేట) : కొత్త రేషన్‌కార్డుల లబ్ధిదారులకు బియ్యం పంపిణీ ప్రారంభమైంది. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన 23 గ్రామాల్లో కొత్తగా రేషన్‌కార్డులు పొందినవారికి ఈనెల నుంచే చౌక ధరల దుకాణాల్లో బియ్యం ఇస్తున్నారు. దీనికోసం అదనంగా కోటా కూడా కేటాయించారు. దీనిపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎంపిక చేసిన గ్రామాలు మినహా..

ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు జనవరి 26వ తేదీన కొత్త రేషన్‌కార్డులను ఇస్తామని ప్రకటించినా.. జిల్లావ్యాప్తంగా సాధ్యపడలేదు. ప్రభుత్వ నిర్ణయం మేరకు నాలుగు సంక్షేమ పథకాలను కూడా మండలానికో గ్రామం చొప్పున అందించారు. దీంతో జిల్లాలోని 23 మండలాల్లోని 23 గ్రామాలను ఎంపిక చేసి కొత్త రేషన్ కార్డులతో పాటు మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించారు. వీరు కాకుండా మిగిలిన గ్రామాల్లో సభలు నిర్వహించి అర్హుల జాబితా చదివి వినిపించారు. జాబితాల్లో పేర్లు వచ్చిన వారు ఇక తమకు ఈ నెల నుంచి రేషన్ అందుతుందని ఆశపడ్డారు. కానీ వారికి నిరాశే మిగిలింది.

2,350 రేషన్ కార్డులు మంజూరు

ప్రస్తుతం జిల్లాలో 3,24,158 రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయం మేరకు జిల్లాలోని 23 గ్రామాల్లో దాదాపు 2,350 కొత్త రేషన్ కార్డులను ప్రభుత్వం జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా.. కొత్త రేషన్ కార్డు దారులకు అందించాల్సిన బియ్యాన్ని ఫిబ్రవరి నుంచే ఇవ్వాలని ఆదేశించారు. రేషన్ కోటాను సైతం పెంచగా 5200 మందికి ఈ రేషన్ అందనుంది. దాదాపు 31,200 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం అదనంగా కేటాయించింది. ఇదిలా ఉండగా ఎంపిక చేసిన గ్రామాలు కాకుండా జిల్లాలోని మిగతా గ్రామాలు, మున్సిపాలిటీల్లో దాదాపు 23,798 కొత్త దరఖాస్తులు, ఆన్‌లైన్ ద్వారా 28వేల దరఖాస్తులు అందగా ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో అర్హుల జాబితాలను చదివి వినిపించారు. ఈ అర్హుల జాబితాలో కొంత మేరకు అనర్హుల పేర్లు రావడంతో తిరిగి అధికారులు విచారణ చేపడుతున్నారు. అయితే వరంగల్ - ఖమ్మం - నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక రావడంతో ఈ ప్రక్రియ ముందుకు సాగేలా కనిపించడం లేదు. ఈ ప్రక్రియ సక్రమంగా సాగితే ఇప్పటికే ఫిబ్రవరి మాసం రేషన్ కోటా ముగిసినందున మార్చి కోటాలోనైనా వీరికి అవకాశం కలుగుతుంది. లేదంటే ఏప్రిల్ కోటాలో కొత్త రేషన్ కార్డుదారులకు బియ్యం అందనున్నాయి. ఇది వరకే ఈ పథకాన్ని ప్రారంభించినందున అర్హులను ఈనెలలో గుర్తించి వచ్చే నెలలోనే రేషన్ కోటా విడుదల చేయాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



మాల బంటి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

సూర్యాపేటటౌన్ : ఇటీవల సూర్యాపేటలో పరువు హత్యకు గురైన వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి కుటుంబాన్ని ఆదుకుంటామని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. గురువారం ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు సూర్యాపేటలోని మాల బంటి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. బంటి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ఐదెకరాల భూమి, ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా కృషి చేస్తామని చెప్పారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి.. మాల బంటి హత్య కేసు పురోగతిపై కలెక్టర్‌తో చర్చించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కేసు వెనక్కి తీసుకుంటే రూ.2కోట్లు ఇస్తామని, లేకపోతే చంపేస్తామని బెదిరిస్తున్నారని బాధితులు కమిషన్ చైర్మన్‌కి చెప్పగా.. హత్యలో పాల్గొన్న వారిని శిక్షించి, బెదిరింపులకు పాల్పడుతున్న దుండగులను అరెస్టు చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ఆరుగురు నిందితులను అరెస్టు చేశామని, మిగతావారిని అరెస్టు చేస్తామని అదనపు ఎస్పీ నాగేశ్వర్ రావు, డీఎస్పీ రవి వివరించారు. బాధిత కుటుంబానికి రూ.4లక్షలు పరిహారం చెల్లించామని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ తెలియజేశారు. కుటుంబాన్ని ఆదుకోవాలని, పెన్షన్, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలన్నారు. ఐదేకరాల భూ పంపిణీ చేయాలని, ఉద్యోగం ఇవ్వాలని కమిషన్ చైర్మన్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రాంబాబు, ఆర్డిఓ వేణుమాధవ్, ఎస్సీ సంక్షేమ అధికారి లత పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోల్లో షాపుల అద్దెకు టెండర్ల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ రీజియన్ పరిధిలోని బస్ డిపోల ప్రధాన రోడ్ల వెంట ఉన్న ఖాళీ షాపులను అద్దెకు ఇవ్వడంతోపాటు పలు బస్ డిపోల్లో క్యాంటీన్, లాజిస్టిక్ సర్వీసెస్, సెల్‌ఫోన్ టవర్స్ కాంట్రాక్టర్ల నియామకానికి టెండర్లను ఆహ్వానిస్తున్నామని ఉమ్మడి నల్లగొండ జిల్లా రీజనల్ మేనేజర్ కె.జానిరెడ్డి తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 18వ తేదీ వరకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ టెండర్ సమర్పించాలని కోరారు. అలాగే ఆర్టీసీ పరిధిలోని దామరచర్ల బస్టాండ్‌లోని ఖాళీ స్థలంలో పెట్రోల్ బంకు నడిపేందుకు సర్వీస్ ప్రొవైడర్ నియామకానికి టెండర్ ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు www.tender.telangana.gov.in నందు సంప్రదించాలని కోరారు.

అనుమతి ఉన్న విత్తనాలే విక్రయించాలి

- రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో రైతుల పంటల సాగు కోసం ప్రభుత్వ అనుమతి ఉన్న విత్తనాలనే విక్రయించేలా అధికారులు చూడాలని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి సూచించారు. గురువారం సూర్యాపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌తో కలిసి కమిషన్ సభ్యులు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పలు చోట్ల నకిలీవిత్తనాలతో రైతులు మోసపోయారన్న ఫిర్యాదులు వచ్చాయని, రానున్న రోజుల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణ పరిస్థితుల కాణంగా పంటలకు ఏదైనా నష్టం జరిగితే వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు సూచనలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తోందన్నారు. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చూడాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న, సునీల్, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, భవాని, అదనపు కలెక్టర్ పి. రాంబాబు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ సాయగౌడ్, వ్యవసాయ శాఖ పరిపాలన అధికారి ఆశా కుమారి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న వెన్నెల గద్దర్

- తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్



వెన్నెల గద్దర్‌ను సన్మానిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : విద్యార్థులు, యువకులు మాదకద్రవ్యాలకు బానిసలుకావొద్దని, దూరంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ పిలుపునిచ్చారు. డ్రగ్స్, గంజాయిపై సూర్యాపేట పబ్లిక్ క్లబ్‌లో గురువారం నిర్వహించిన చైతన్య సదస్సులో ఆమె మాట్లాడారు. సమాజానికి మాదక ద్రవ్యాలు పెను సవాల్‌గా మారాయని, యువత విద్యార్థులు తక్షణ ఆనందం కోసం ఈ బలహీనతలకు లోనై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని సూచించారు. సూర్యాపేట ప్రాంతం ఎంతో చైతన్యవంతమైందని, ఎన్నో ప్రజాస్వామ్య ఉద్యమాలకు దారులు వేసిందని చెప్పారు. నైజాం నవాబుపై సుట్టు ముట్టు సూర్యాపేట అంటూ గిరి గీసిన ఈ ప్రాంతంలో గంజాయి వ్యసనం రావడం బాధాకరమైన అంశమన్నారు. గంజాయి, డ్రగ్స్ పైన తెలంగాణ సాంస్కృతిక సారథి ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి యువజన చైతన్య సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్, యువ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సలీమ్ పాష, మాసంపల్లి అరుణ్ కుమార్, విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని వినయ్, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు గట్ల రమాశంకర్, యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్ ముదిరాజ్, నాగరాజుగౌడ్, భిక్షం నాయక్ పాల్గొన్నారు.

పనిదినాలు.. 63.97లక్షలు

- 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి ప్రణాళిక ఖరారు
- రూ.193కోట్లు ఖర్చు చేసేలా బడ్జెట్ ప్రతిపాదనలు
- ఉన్నతాధికారుల నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే పనులు ప్రారంభించేలా కార్యాచరణ
- అర్హత కలిగిన కుటుంబానికి వంద రోజులు పని కల్పించడమే లక్ష్యం



నాగారం : ఉపాధి హామీ పథకం ప్రణాళిక ఖరారైంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను జిల్లా వ్యాప్తంగా 63.97లక్షల పనిదినాలు కల్పించాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. దీనికోసం రూ.193కోట్లు ఖర్చు చేసేలా బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించారు. వీటిని ఉన్నతాధికారులు ఆమోదానికి పంపించారు. గ్రీన్‌సిగ్నల్ రాగానే పనులు మొదలు పెట్టనున్నారు.

వలసల నివారణకు..

గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించి ఉపాధి కల్పించేందుకు...వారు ఆర్థికంగా ఎదిగేందుకు సుమారు 20 ఏళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పించటమే ఈ పథకం ఉద్దేశం. గ్రామ స్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఎలాంటి పనులు చేపట్టాలో నిర్ణయించారు.

చేపట్టే పనులు ఇవీ..

ముఖ్యంగా పశువుల షెడ్లు, కోళ్ల షెడ్లు, ఇంకుడు గుంతలు, నీటి తొట్ల నిర్మాణం, నీటి నిల్వ వసతులు, నర్సరీల ఏర్పాటు, చెక్ డ్యామ్‌లు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పంట పొలాలకు రోడ్ల అనుసంధానం, నీటి కుంటల నిర్మాణం, వనమహోత్సవంలో పండ్ల తోటల పెంపకం తదితర పనులన్నీ ఈ పథకం కింద చేపట్టనున్నారు.

ఆత్మీయ భరోసాతో ఉపాధి పనికి డిమాండ్..

తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా అర్హులై గుంట భూమిలేని వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12వేలు చెల్లిస్తామని ప్రకటిం చింది. జాబ్‌కార్డు కలిగి ఉండి..కనీసం ఏడాదిలో 20 పని దినాలకు హాజరైన పేద కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఏడాదికి రూ.12వేలు సాయంగా అందిస్తోంది. ఈ క్రమంలో యాక్టివ్ కార్డులతో పాటు కూలీల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. దీంతో ఉపాధి హామీ పథకంలో చాలా మంది పనులు చేసి ఆత్మీయ భరోసాతో నమోదు చేసుకునేందుకు ఆసక్తి చూపే అవకాశం ఉంది.

గత ఏడాది ఇలా...

జిల్లాలో 23 మండలాలు ఉండగా వీటి పరిధిలో 475 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 2,62,106 జాబ్‌కార్డులు ఉండగా, వీటి పరిధిలో 5.71లక్షల మంది కూలీలుగా నమోదై ఉన్నారు. కాగా వీరిలో పనికి వెళ్లే కూలీలు 2.91లక్షలుగా ఉన్నారు. 2024-25లో ఉపాధి హామీ పథకంలో జిల్లాలో 57.41లక్షల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించారు. వీటిలో ఇప్పటి వరకు 51.17లక్షల పనిదినాలను పూర్తి చేశారు. అలాగే ఇప్పటి వరకు 473 కుటుంబాలకు వంద రోజుల పనిదినాలు కల్పించారు.

ఉపాధి పథకం వివరాలు

జాబ్ కార్డుల సంఖ్య	2.62 లక్షలు
కూలీల సంఖ్య	5.71లక్షలు
ఉపాధి పనులకు వెళ్లేవారు	2.91లక్షలు
2025-26లో పనిదినాల ఖరారు	63.97లక్షలు
2024-25లో పనిదినాల సంఖ్య	57.41లక్షలు
ఇప్పటి వరకు పూర్తయిన పనిదినాలు	51.17లక్షలు
వంద రోజులు పనిదినాలు కల్పించిన కుటుంబాలు	473

బడ్జెట్ ఆమోదానికి ప్రతిపాదనలు

వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టే ఉపాధిహామీ పనుల లక్ష్యాన్ని గ్రామసభల్లో ఖరారు చేశాం. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 100 రోజులు పనికల్పించేలా ప్రణాళికలు రూపొందించి, బడ్జెట్ ఆమోదం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. బడ్జెట్ ఆమోదం రాగానే జిల్లాలో ఉపాధి పనులను ప్రారంభిస్తాం.


-వి.వి అప్పారావు, డీఆర్‌డీఓ, సూర్యాపేట.

మట్టపల్లిలో నృసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాలతో గురువారం నిర్వహించారు. ఆలయంలో విశేష పూజలు చేశా రు. సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్ కు పంచామృతాభిషేకం చేపట్టారు. శ్రీస్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ చేపట్టారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు , ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వాన్ని నడపడం చేతకావట్లేదు

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



సూర్యాపేటటౌన్: కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రభుత్వాన్ని నడపడం చేతకాక.. 14 నెలలు గడుస్తున్నా ఇంకా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌పై ఏడుస్తునే ఉన్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి విమర్శించారు. గురువారం సూర్యాపేటలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతమంది అనామకులు.. మేమున్నామని చెప్పుకోవడానికే అప్పుడప్పుడు మొరుగుతున్నారన్నారు. సీఐడీ కాదు.. అంతకంటే పెద్ద సంస్థతోనైనా విచారణ చేయించాలన్నారు. ఎంక్వైరీ అంటూ జరిగితే ముందుగా జైలుకు పోయేది సీఎం రేవంత్‌రెడ్డేనని పేర్కొన్నారు. గుమ్మడికాయ దొంగలెవరంటే కాంగ్రెస్ వారే భుజాలు తడుముకుంటున్నారని అన్నారు. కేసీఆర్ చేపట్టిన సర్వేనే కరెక్ట్ అని, రేవంత్ సర్వే అంతా బోగస్ అని కాంగ్రెస్ పార్టీ నాయకులే అంటున్నారని అన్నారు. కేసీఆర్ సర్వే అంటే దేశ విదేశాలనుంచి స్వచ్ఛందంగా తరలివచ్చారన్నారు.కాంగ్రెస్ సర్వే అంటే తరుముతున్నారని మీరే చెబుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ పాలన చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. జనాభా తగ్గించి చూపితే మన రాష్ట్రానికి నష్టమనే సోయిలేదా అని విమర్శించారు. స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో మరోసారి మోసానికి కాంగ్రెస్ కుట్రలు పన్నిందని, చివరికి ప్రజల్లో తేటతెల్లం అయ్యేసరికి చేతులెత్తేసిందన్నారు. ప్రజల్లో కాంగ్రెస్‌పై తిరుగుబాటు మొదలైందని, ఇకనైనా చెంపలేసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు.

క్లుప్తంగా

రేపు నవోదయ ప్రవేశ పరీక్ష

పెద్దవూర: మండలంలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి వివిధ కారణాలతో 9వ, 11వ తరగతుల్లో ఏర్పడిన ఖాళీల భర్తీకి శనివారం ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్. నాగభూషణం తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలను వేర్వేరు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 9వ తరగతి నందు ప్రవేశానికి గాను 652 మంది బాలురు, 424 మంది బాలికలు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. 9వ తరగతి ప్రవేశ పరీక్షను నల్లగొండ జిల్లా కేంద్రంలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 11వ తరగతి నందు ప్రవేశానికి గాను 1265 మంది బాలురు, 1337 మంది బాలికలు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. 11వ తరగతి ప్రవేశ పరీక్షకు మొత్తం సూర్యాపేట జిల్లాలో 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హాల్‌టికెట్ల నందు తెలియపరిచిన విధంగా పరీక్షా కేంద్రానికి నిర్ధిష్ట సమయంలో చేరుకోవాలని సూచించారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య


అశోక్‌రెడ్డి (ఫైల్)

మోత్కూరు: మద్యానికి బానిసైన వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మోత్కూరు మండలం రాగి బావి గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాగిబావి గ్రామానికి చెందిన పెసరు అశోక్‌రెడ్డి (54) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గురువారం ఇంటి వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే అశోక్‌రెడ్డి మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు కృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి. నాగరాజు తెలిపారు. మృతుడికి భార్య అనిత, కుమారుడు, వివాహం అయిన కుమార్తె ఉన్నారు.

కుటుంబ కలహాలతో..


వెంకటేష్ (ఫైల్)

చౌటుప్పల్: కుటుంబ కలహాలతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో గురువారం వెలుగుచూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగడపల్లి గ్రామానికి చెందిన గాదె వెంకటేష్(36) సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, కుమార్తె ఉన్నారు. వెంకటేష్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల వెంకటేష్ భార్య తన కుమార్తెను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో వెంకటేష్ మనస్తాపం చెందాడు. అయితే నిత్యం తమకు కనిపించే వెంకటేష్ సోమవారం రాత్రి నుంచి కనిపించకపోవడంతో చుట్టుపక్కల వారు గురువారం అతడి ఇంటి తలుపు తీసి లోనికి వెళ్లి చూడగా ఉరేసుకుని మృతిచెంది ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ యాదగిరి తెలిపారు.

నేటి నుంచి పూర్వగిరి బ్రహ్మోత్సవాలు

- 10న తిరు కల్యాణం
- 13న శతఘటాభిషేకంతో ముగియనున్న ఉత్సవాలు


భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణంలో తాత్కాలిక చలువ పందిళ్లు, కల్యాణ మండపాన్ని విద్యుత్ దీపాల అలంకరించారు. భక్తులకు స్వాగతం పలికేందుకు స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. స్వామివారు ఊరేగే వాహన సేవలను, ఆలయంలో యాగశాలను సైతం సిద్ధం చేశారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఇప్పటికే అర్చకులు, పారాయణీకులు, రుత్వికులు ఆలయానికి వచ్చారు.

బ్రహ్మోత్సవాలు కొనసాగేది ఇలా..

శుక్రవారం ఉదయం స్వస్తీ వాచనం, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, సాయంత్రం అంకురారోపణము, మృత్సంగ్రహణంతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. 8వ తేదీన ఉదయం ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ, మూలమంత్ర హవనం, వేద పారాయణం, సాయంత్రం భేరీ పూజ, దేవతాహ్వానం నిర్వహిస్తారు. 9వ తేదీన ఉదయం హవనం, సింహ వాహన అలంకార సేవ నిర్వహించి, సాయంత్రం హవనం, అశ్వ వాహనం అలంకార సేవలో ఎదుర్కోలు ఉత్సవాన్ని చేపడతారు. 10వ తేదీన ఉదయం హవనం, తిరుమంజన ఉత్సవం, హనుమంత వాహన అలంకార సేవను ఊరేగిస్తారు. అదే రోజు సాయంత్రం హోమం, రాత్రి గజవాహన సేవ, తిరు కల్యాణ మహోత్సవం జరుగుతుంది. 11వ తేదీన ఉదయం హవనం, గరుఢ వాహన సేవ, సాయంత్రం రథాంగ హోమం, రాత్రి స్వామివారి దివ్య విమాన రథోత్సవం ఆలయ తిరువీధుల్లో ఊరేగిస్తారు. 12వ తేదీన ఉదయం మహాపూర్ణాహుతి, మధ్యాహ్నం చక్రతీర్థ స్నానం, సాయంత్రం దేవతోద్వాసన, పుష్పయాగం, డోలోత్సవం జరిపిస్తారు. 13వ తేదీన ఉదయం అష్టోత్తర శతఘటాభిషేకం, మహదాశీర్వచనం, పండిత సన్మానంతో ఉత్సవాలను ముగిస్తారు.

మొక్కు పూజలు రద్దు..

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో భక్తులచే జరిపించే మొక్కు పూజలు ఈ నెల 13వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు ఈఓ భాస్కర్‌రావు వెల్లడించారు. 10వ తేదీ కల్యాణోత్సవంలో రూ.600 చెల్లించి భక్తులు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. 11వ తేదీ రథోత్సవం సందర్భంగా రాత్రి ఆర్జిత సేవలు, అర్చనలు, భోగములు, సేవలు రద్దు చేశామన్నారు. 12వ తేదీ చక్ర తీర్థం సందర్భంగా ఆర్జిత అభిషేకం, అర్చనలు నిర్వహించబడవన్నారు. 13వ తేదీన స్వామివారి అష్టోత్తర శతఘటాభిషేకం ఉండటంతో అర్జిత అభిషేకాలు, అర్చనలు రద్దు చేశామని, శతఘటాభిషేకంలో పాల్గొనే భక్తులు రూ.250 టిక్కెట్ కొనుగోలు చేసి పాల్గొనవచ్చునన్నారు.

బుద్ధవనంలో నేడు త్రిపిటక ఉత్సవం


మహాస్థూపంలోని అష్టబుద్ధుల వద్ద పుష్పాలంకరణ చేస్తున్న బౌద్ధసన్యాసులు


విద్యుత్ దీపాల వెలుగులో మహాస్థూపం

నాగార్జునసాగర్: దక్షిణ భారతదేశంలో మొదటి సారిగా నాగార్జునసాగర్‌లో శుక్రవారం జరగనున్న 'త్రిపిటక సద్ధమ్మ సజ్జాయన' ఉత్సవానికి బుద్ధవనం ముస్తాబైంది. 108 మంది బౌద్ధసన్యాసులతో శుక్రవారం చాంటింగ్(ప్రార్థనలు)చేయనున్నారు. ఇప్పటికే బౌద్ధసన్యాసులు నాగార్జునసాగర్‌కు చేరుకొని బుద్ధవనంలోని బుద్ధుని ప్రతిమలను, మహాస్థూపాన్ని అలంకరించడం పనులలో నిమగ్నమయ్యారు. త్రిపిటక పఠనం బౌద్ధ సంప్రదాయంలో ముఖ్యమైన అభ్యాసం. ఇది ఆధ్యాత్మిక, విద్యా సాంస్కృతికత ఉన్న బహుళ ప్రయోజనాలను కలిగిస్తుంది. అభ్యాసకుల మధ్య ఐక్యతను పెంచి, సన్యాసులు సామాన్యులతో కలిసేందుకు సానుకూల మానసిక స్థితిని పెంపొందిస్తుంది. బౌద్ధపండుగలు, ఆచారాలు, వేడుకలను వారసత్వంగా అభ్యాసకులకు అందించడం జరుగుతుంది. శుక్రవారం ఉదయం 8గంటలకు అశోకచక్రం దగ్గరి నుంచి మహాస్థూపం వరకు బుద్ధుని ప్రతిమను పల్లకిలో ర్యాలీగా తీసుకెళ్తారు. 9.30గంటల నుంచి చాంటింగ్ మొదలై 11గంటల వరకు కొనసాగుతుంది. 11గంటల నుంచి 12గంటల వరకు స్థానిక ఉపాసకులతో ముచ్చటిస్తారు. ఒంటిగంట నుంచి 3గంటల వరకు చాంటింగ్ ఉంటుంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు

చిట్యాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చిట్యాల మండల పరిధిలోని వెలిమినేడు గ్రామ శివారులో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. చిట్యాల పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లాలోని యోర్గేరా గ్రామానికి చెందిన హోనప్ప రాజు(22)తో పాటు అతడి స్నేహితుడు మల్లేష్‌నాయక్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి బైక్‌పై బయల్దేరారు. మార్గమధ్యలో గురువారం తెల్లవారుజామున చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులో జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన రెయిలింగ్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో హోనప్ప రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి స్నేహితుడు మల్లేష్‌నాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి తల్లి నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలి పారు. రాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం నల్లగొండ ప్రభు త్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన మల్లేష్‌నాయక్‌ను చికిత్స నిమి త్తం మొదట నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి అక్కడి నుంచి కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్‌కు తరలించారు.

స్కూటీని ఢీకొట్టిన డీసీఎం వాహనం

- తీవ్ర గాయాలతో రోడ్డు పైనే మహిళ నరకయాతన
- సమాచారం ఇచ్చిన 45 నిమిషాల తర్వాత వచ్చిన 108 అంబులెన్స్


రోడ్డుపై పడిపోయిన బాధితురాలు

చిట్యాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చిట్యాల పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట పట్టణానికి చెందిన నర్మద పని నిమిత్తం గురువారం స్కూటీపై చిట్యాలకు వచ్చింది. తిరుగు ప్రయాణంలో సర్వీస్ రోడ్డు నుంచి రామన్నపేటకు వెళ్లేందుకు పోలీస్ స్టేషన్ ఎదురుగా హైవే దాటుతుండగా.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న డీసీఎం స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్మద తలకు తీవ్ర గాయమైంది.

45నిమిషాల పాటు హైవే పైనే..

నర్మద తలకు తీవ్ర గాయం కావడంతో హైవే పైనే పడిపోయింది. దీంతో అక్కడే ఉన్న పోలీసులతో పాటు స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. 45నిమిషాల వరకు అంబులెన్స్ ఘటనా స్థలానికి చేరుకోలేదు. అనంతరం నార్కట్‌పల్లికి చెందిన 108 అంబులెన్స్ ఘటనా స్థలానికి చేరుకుని నర్మదను నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. సకాలంలో అంబులెన్స్ రాకపోవటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం భువనగిరి మండల పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు గ్రామానికి చెందిన కేతం గోపాలకృష్ణ(31)కు మానసికస్థితి సరిగ్గా లేదు. గురువారం మధ్యాహ్నం బొమ్మాయిపల్లి–నాగిరెడ్డిపల్లి రైల్వే స్టేషన్ల మధ్య సికింద్రాబాద్ నుంచి విష్ణుపురం వైపు వెళ్లే ఆఫీసర్ స్పెషల్ ట్రైన్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ జీఆర్‌పీ రైల్వే ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

మృతిచెందిన మూడు నెలలకు గుర్తింపు

- సమాధి వద్ద కన్నీరుమున్నీరైన కుటుంబీకులు
- బాధితులది కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్


కిష్టమ్మ అంత్యక్రియలు జరిగిన చోట నివాళులర్పిస్తున్న కుటుంబీకులు

నేలకొండపల్లి: ఇంటి నుంచి తప్పిపోయిన మహిళ కోసం మూడు నెలలుగా గాలిస్తుండడంతో చివరకు ఆమె మృతిచెందిందని, గుర్తుతెలియని మృతదేహంగా భావించి అంత్యక్రియలు కూడా పూర్తిచేశారని తెలియడంతో ఆమె కుటుంబీకులు కన్నీరుమున్నీరైన ఘటన ఇది. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్‌కు చెందిన కుక్కమూడి కిష్టమ్మ(70) గత ఏడాది నవంబర్ 27న వేములవాడలోని బంధువుల ఇంటికి ఒంటరిగా వెళ్తూ ప్రమాదవశాత్తు సాగర్ కాల్వలో పడి గల్లంతైనట్లు సమాచారం. ఆ తర్వాత డిసెంబర్ 17న ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని కాల్వలో వృద్ధురాలి మృతదేహాన్ని గుర్తించినా అప్పటికే గుర్తుపట్టలేని స్థితిలో ఉండడంతో మార్చురీలో భద్రపరిచారు. పోలీసులు సోషల్ మీడియా ద్వారా ఆచూకీ కోసం యత్నించినప్పటికీ వివరాలు తెలియకపోవడంతో డిసెంబర్ 25న మృతదేహానికి అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో అంత్యక్రియలు పూర్తిచేయించారు. అనంతరం వాట్సప్‌లో ఓ గ్రూప్ నుంచి మరో గ్రూప్‌కు ఫొటోలు షేర్ చేస్తుండడం.. కిష్టమ్మ కుటుంబీకులు ఆమె కోసం గాలిస్తుండడంతో విషయం బయటపడింది. దీంతో నేలకొండపల్లి పోలీసులను గురువారం ఆశ్రయించగా అప్పటికే అంత్యక్రియలు పూర్తయినట్లు చెప్పడంతో స్థానిక శ్మశాన వాటికలో నివాళులర్పించి భారమైన హృదయంతో వెనుతిరిగారు.

క్వారీలో జారిపడి కార్మికుడు మృతి

బొమ్మలరామారం: ప్రమాదవశాత్తు క్వారీలో జారి పడి కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన బొమ్మలరామారం మండలం రామలింగంపల్లి గ్రామంలో జరిగింది. బొమ్మలరామారం పోలీస్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ బుగ్గ శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం.. రామలింగంపల్లి గ్రామ శివారులో గల స్టార్ రాక్ ఇండస్ట్రీకి సంబంధించిన క్వారీలో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శిబ్బుసింగ్(23) డ్రిల్లింగ్ పనిచేస్తున్నాడు. మంగళవారం క్వారీలో డ్రిల్లింగ్ చేసే వాహనం రిపేర్‌కు గురికాగా శిబ్బుసింగ్‌తో పాటు మరో ముగ్గురు కార్మికులు రాత్రి వరకు రిపేర్ చేస్తూ వాహన సమీపంలోనే నిద్రించారు. బుధవారం తెల్లవారుజామున మరుగుదొడ్డికి వెళ్లిన శిబ్బుసింగ్ ప్రమాదవశాత్తు క్వారీలో జారి పడి మృతిచెందాడు. గురువారం మృతుడి సోదరుడు సోహన్‌లాల్ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దేవేందర్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


జానయ్య (ఫైల్)

వేములపల్లి(మాడ్గులపల్లి): భార్య మందలించిందని మనస్తాపానికి గురై గడ్డిమందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ ఘటన మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామ పంచాయతీ పరిధిలోని చింతలగూడెం గ్రామంలో జరిగింది. మాడ్గులపల్లి ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చింతలగూడెం గ్రామానికి చెందిన ఆరూరి జానయ్య(40) ఈ నెల 4న కుక్కడం గ్రామంలోని తన చెల్లెలు ఇంట్లో నిర్వహించిన ఎల్లమ్మ పండుగకు హాజరయ్యాడు. ఈ క్రమంలో మద్యం తాగిన మైకంలో జానయ్య గొడవ చేస్తుండగా ఇదేం పద్ధతి అని అతడి భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన జానయ్య ఇంటికి వెళ్లిన తర్వాత మరుసటి రోజు ఉదయం గడ్డి మందు తాగాడు. గమనించిన భార్య జయమ్మ, కుటుంబ సభ్యులు వెంటనే జానయ్యను చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉరేసుకుని బలవన్మరణం


పవన్ (ఫైల్)

గుర్రంపోడు: గుర్రంపోడు మండలం పిట్టలగూడెం గ్రామానికి చెందిన యువకుడు గురువారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్టలగూడెం గ్రామానికి చెందిన బైరి పవన్(18) డీజే ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పవన్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడి తండ్రి బైరి బసవయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వంతెనపై డీసీఎం బోల్తా

- విజయవాడ–హైదరాబాద్ హైవేపై నిలిచిపోయిన వాహనాలు


బోల్తా పడిన సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న డీసీఎం

కోదాడరూరల్: ఆంధ్రప్రదేశ్ నుంచి సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న డీసీఎం కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్ వద్ద పాలేరు వంతెనపై అదుపుతప్పి బోల్తా పడింది. సిమెంట్ బస్తాలు రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. పాలేరు వంతెనపై ఉన్న పాత రోడ్డు మరమ్మతులు జరుగుతుండటంతో వాహనాలు వన్ వేలోనే రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో తెలంగాణ, ఏపీ వైపు వాహనాలు భారీగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న కోదాడ రూరల్ పోలీసులు, ఏపీలోని జగ్గయ్యపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సిమెంట్ బస్తాలను, డీసీఎంను పక్కకు తీయించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

పోచంపల్లిలో నేపాల్ దేశస్తులు


చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న నేపాల్ దేశస్తులు

భూదాన్‌పోచంపల్లి: నేపాల్ ప్రతినిధుల బృందం గురువారం భూదాన్‌పోచంపల్లిని సందర్శించింది. సహకార పాలనపై హైదరాబాద్‌లో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సుకు నేపాల్ దేశానికి చెందిన 30 మంది సీఈఓలు, ఎగ్జిక్యూటివ్‌లు హాజరయ్యారు. తమ టూర్‌లో భాగంగా భూదాన్‌పోచంపల్లిని సందర్శించారు. చేనేతగృహాలు, చేనేత సహకార సంఘం, టూరిజం పార్కుకు వెళ్లి మగ్గాలను పరిశీలించారు. వస్త్ర డిజైన్లు పరిశీలించి నేత కళాకారుల నైపుణ్యాలను కొనియాడారు. అలాగే చేనేత వస్త్రాలు కొనుగోలు చేశారు.

మోసపోయిన రైతులకు న్యాయం చేస్తాం

- రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి


పొట్లపహాడ్‌లో వరి పంటను పరిశీలిస్తున్న కోదండరెడ్డి, కమిషన్ సభ్యులు

పెన్‌పహాడ్: కల్తీ విత్తనాలతో మోసపోయిన రైతుల పంట పొలాలను శాస్త్రవేత్తల ద్వారా పరిశోధన చేయించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం .కోదండరెడ్డి హామీ ఇచ్చారు. పెన్‌పహాడ్ మండల పరిధిలోని పొట్లపహాడ్‌లో గురువారం గజ్జి వెంకన్న వరి పొలాన్ని రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్‌తో పాటు సభ్యులు పరిశీలించారు. కల్తీ విత్తనాల కారణంగా వరి పంట 45రోజులకే పొట్టదశకు చేరి కంకులు వస్తున్నాయని వెంకన్న వ్యవసాయ అధికారులతో పాటు రైతు సంక్షేమ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కోదండరెడ్డి మాట్లాడుతూ.. అధికారుల రిపోర్టుల ఆధారంగా కాకుండా పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి రైతుల సమస్య నేరుగా తెలుసుకునేందుకు వచ్చినట్లు చెప్పారు. విత్తనాల్లో నాణ్యత లేదని తేలిందన్నారు. వరి పొలాలకు వాతావరణ మార్పుల వలన తెగుళ్లు వస్తాయి తప్ప.. ముందస్తుగా కంకులు రావని తెలిపారు. ఖమ్మం జిల్లాలో మిర్చి, మహబూబాద్, సూర్యాపేట జిల్లాలో వరి విత్తనాల్లో కల్తీ విత్తనాలతో నష్టపోతున్నామని రైతులు కమిషన్ దృష్టికి తీసుకువచ్చినట్లు కోదండరెడ్డి తెలిపారు. ఇప్పటికే రెండు దఫాలుగా విత్తనాల కంపెనీలతో సమావేశాలు నిర్వహించి సమీక్ష జరిపినట్లు ఆయన తెలిపారు. గరిడేపల్లి మండలం గడ్డిపల్లి, సూర్యాపేట పట్టణంలో సీడ్స్ దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసినట్లు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ పర్యటనలో కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, మరికంటి భవానిరెడ్డి, చెవిటి వెంకన్నయాదవ్, భూమి సునీల్‌తో పాటు డీఏఓ శ్రీధర్ రెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మహిళను హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు

రామగిరి(నల్లగొండ): మహిళను హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ జిల్లా రెండవ అదనపు కోర్టు జడ్జి ఎన్. రోజారమణి గురువారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లాకు చెందిన మూజువర్ నూర్ మహ్మద్ సూర్యాపేటలో కేబుల్ ఆపరేటర్‌గా పనిచేసేవాడు. ఈ క్రమంలో భర్తను విడిచిపెట్టి కొడుకు, కుమార్తెతో కలిసి ఉంటున్న చివ్వెంల మండలానికి చెందిన భూక్యా విజయతో మూజువర్ నూర్ మహ్మద్‌కు పరిచయం ఏర్పడింది. వీరిద్దరు కొంతకాలం సహజీవనం చేశారు. విజయ వేరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుందని మహ్మద్‌కు అనుమానం ఏర్పడింది. ఇదే విషయమై ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. ఈ క్రమంలో 2014 జూన్ 26న విజయ కుమార్తెకు గురుకుల పాఠశాలలో సీటు మాట్లాడాలని ఆమెతో పాటు మూజువర్ నూర్ మహ్మద్ దేవరకొండకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కనగల్ మండం పర్వతగిరి వద్ద అర్ధరాత్రి రోడ్డు వెంట గుడిసెలో విజయ, నూర్ మహ్మద్ మద్యం సేవించారు. ఈ క్రమంలో విజయ తలపై నూర్ మహ్మద్ బండరాయితో మోది హత్య చేశాడు. ఎవరూ గుర్తుపట్టకుండా మృతదేహంపై పెట్రోల్ పోసి నిప్పంటించి అక్కడి నుంచి పారిపోయాడు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అప్పటి సీఐ సుబ్బారెడ్డి, డీఎస్పీ రాములునాయక్ విచారణ చేపట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్. అఖిల వాదనలతో ఏకీభవించిన జడ్జి రోజారమణి నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో సరైన ఆధారాలు కోర్టులో సమర్పించిన ఇప్పటి సీఐ వెంకటయ్య, ఎస్ఐ విష్ణుమూర్తి, కోర్టు కానిస్టేబుల్ నగేష్, లైజనింగ్ ఆఫీసర్ నరేందర్, మల్లికార్జున్‌ను అభినందించారు.

జల విద్యుత్ కేంద్రంలో బ్యాటరీలు చోరీ


చోరీకి గురైన బ్యాటరీలు

నేరేడుచర్ల: జల విద్యుత్ కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తులు బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. నేరేడుచర్ల మండలం వైకుంఠాపురం గ్రామ పరిధిలోని ఎన్ఎస్‌పీ కెనాల్‌పై కళ్లెం బ్రదర్స్ కాటన్ ప్రైవేట్ ఇండస్ట్రీస్ పవర్ ప్లాంట్ నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా ఈ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. ఇదే కేంద్రంలో పనిచేస్తున్న గుండ్ల వేణుగోపాల్‌రెడ్డి సమీపంలోని పొలాన్ని కౌలు చేస్తున్నాడు. గురువారం జల విద్యుత్ కేంద్రాన్ని పరిశీలించగా జనరేటర్ రూమ్ తాళం తెరిచి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా సుమారు రూ.70వేల విలువైన 11కేవీ ఇన్వర్టర్, 150 ఏహెచ్, 90 ఏహెచ్ బ్యాటరీలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. విషయాన్ని జల విద్యుత్ కేంద్రం డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సూపర్‌వైజర్ వేణుగోపాల్‌రెడ్డికి తెలియజేశాడు. డైరెక్టర్ సూచనల మేరకు వేణుగోపాల్‌రెడ్డి నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపారు.

వ్యవసాయ పొలాల్లో అడవి దున్న సంచారం

- అడవి దున్నను పట్టుకునే క్రమంలో గాయపడిన ఫారెస్ట్ సిబ్బంది

చౌటుప్పల్ రూరల్: ఇటీవల ఆత్మకూర్(ఎం) మండలంలో సంచరించిన అడవి దున్న అటవీ శాఖ అధికారులకు దొరకకుండా తప్పించుకుపోయింది. తాజాగా గురువారం చౌటుప్పల్ మండలం చిన్నకొండూర్, పెద్దకొండూర్ గ్రామాల మధ్య ఉన్న వెంకటబావి వద్ద పొలాల్లో అడవి దున్న రైతుల కంటపడింది. వరి పొలాల గెట్ల వెంట అడవి దున్న సంచరించడాన్ని రైతులు గమనించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ అధికారులు వెంకటబావి పరిసరాలకు చేరుకుని అడవి దున్నను పట్టుకునేందుకు ప్రయత్నించారు. జనాలను చూసి కంప చెట్ల పొదల్లోకి అడవి దున్న పారిపోయింది. దీంతో అటవీ అధికారులు అడవి దున్నకు మత్తు మందు ఇచ్చి పట్టుకోవడానికి గన్‌తో షూట్ చేసిన కూడా అది తప్పించుకుంది. ముమ్మర ప్రయత్నం చేసినప్పటికీ అడవి దున్న కంప చెట్లలో నుంచి తప్పించుకుపోయింది.

ఫారెస్ట్ సిబ్బందిలో ఒకరికి గాయాలు

అడవి దున్నను పట్టుకోవడానికి ఫారెస్ట్ అధికారులు ఉదయం నుంచి తీవ్ర ప్రయత్నం చేశారు. గన్‌తో షూట్ చేసి మత్తు మందు ఇవ్వడానికి ప్రయత్నించారు. అడవి దున్న సిబ్బంది పైకి వస్తున్న క్రమంలో తప్పించుకోవడానికి ప్రయత్నించిన ఫారెస్ట్ సిబ్బందిలో ఒకరు స్వల్పంగా గాయపడినట్లు తెలిసింది. గాయపడిన అటవీ శాఖ సిబ్బందిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

సంగెం గ్రామం వైపు వచ్చిన అడవి దున్న..

వలిగొండ: మండలంలోని సంగెంలో అడవి దున్న గురువారం హల్‌చల్ చేసింది. చౌటుప్పల్ మండలం చిన్నకొండూర్ సమీపంలో సంచరిస్తున్న అడవి దున్నను పట్టుకునేందుకు అటవీశాఖ అధికారులు, పశువైద్యాధికారులు గన్‌తో మత్తు మందు ఇచ్చేందుకు ప్రయత్నించగా అది తప్పించుకుని సంగెం గ్రామం వైపు వచ్చినట్లు యాదాద్రి జిల్లా అటవీ శాఖ అధికారి తెలిపారు. అడవి దున్నను పట్టుకునే ప్రయత్నంలో పశువైద్యాధికారి షానవాజ్ స్వల్పంగా గాయపడినట్లు పేర్కొన్నారు. అడవి దున్నను పట్టుకోవడానికి 35మంది అటవీశాఖ సిబ్బందితో తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నామని, చీకటి పడడంతో శుక్రవారం ఉదయం నుంచి తిరిగి గాలింపు చర్యలు కొనసాగిస్తామని, అడవి దున్నను పట్టుకునేందుకు ప్రజలు సహకరించాలని సతీష్‌బాబు కోరారు.


చిన్నకొండూర్‌లో సంచరిస్తున్న అడవి దున్న


అడవి దున్నను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న ఫారెస్ట్ అధికారులు